క్లుప్తంగా

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా వెంకన్న



నియామకపత్రం అందుకుంటున్న ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకన్నగౌడ్

కేతేపల్లి: టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామానికి చెందిన చనగోని వెంకన్నగౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మధుయాష్కీగౌడ్ నియామక పత్రాన్ని ఆదివారం వెంకన్నగౌడ్‌కు అందజేశారు.

యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా రాకేష్

నల్లగొండ రూరల్: యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల గ్రామానికి చెందిన పుట్టా రాకేష్ ముదిరాజ్‌ను నియమిస్తూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్ష పదవికి రాజీనామా

గట్టుప్పల్(చండూరు): గట్టుప్పల్ మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు మహ్మద్ అబ్బాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కొనసాగుతానని పేర్కొన్నారు.

విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

నకిరేకల్: నకిరేకల్‌లోని ఎస్పీఆర్ స్కూల్‌లో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల స్థాయి టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, మల్లం మహేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్, ఎస్పీఆర్ స్కూల్ కరస్పాండెంట్ బి.కన్నయ్యగౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేషం, అంజయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దర్వేశిపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న డీఎస్పీ శివరాంరెడ్డి

కనగల్: దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులు రద్దీ నెలకొంది. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది ఆయనకు అమ్మవారి ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లుబెల్లి నర్సింహారెడ్డి, ఈఓ జల్లేపల్లి జయరామయ్య, అర్చకులు మల్లాచారి, శ్రవణాచారి, దామోదర్, మహేష్, సిబ్బంది చంద్రయ్య, లింగయ్య, నాగరాజు, ఉపేందర్‌రెడ్డి, లింగస్వామి, ఆంజనేయులు తదితరులున్నారు.

20 నుంచి బ్రహ్మోత్సవాలు

చండూరు: తుమ్మలపల్లిలోని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గజ్జెల కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న శుక్రవారం తెల్లవారు జామున కల్యాణం, 25న రథోత్సవం, 26న అగ్ని గుండాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఆలయం ముస్తాబు

కనగల్: మండలంలోని రేగట్టె గ్రామంలో ఉన్న శ్రీభవాని శంకర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. 18న స్వామివారి కల్యాణ మహోత్సవం, 20న రథోత్సవం, నంది వాహన భాగవత నాటకం, 21న అగ్నిగుండాలు, శివ పూజలు, వీధి నాటకం, త్రిశూల తీర్థం, వసంతోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బియ్యం పంపిణీ

నల్లగొండ రూరల్: నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్ కుమార్తె మోక్షజ్ఞ జన్మదినం సందర్భంగా పట్టణంలోని చారుమతి చైల్డ్ కేర్ సెంటర్‌లో ఆదివారం అనాథ విద్యార్థులకు బియ్యం, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

జోరుగా మట్టిదందా!

- చొల్లేడులోని చెరువులో రాత్రి సమయంలో మట్టి తవ్వకం
- నాలుగు, ఐదు కిలోమీటర్ల దూరంలో డంప్ చేస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

మునుగోడు: అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములు, చెరువుల్లోని మట్టిని కొందరు అక్రమార్కులు రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా ఇటుకల తయారీకి అవసరమైన మట్టికి భారీగా డిమాండ్ ఉండడంతో చెరువుల్లోని మట్టిని రాత్రి సమయంలో తరలిస్తున్నారు. మునుగోడు మండలంలోని చొల్లేడు గ్రామంలోని మైసమ్మ చెరువు నుంచి గత 20 రోజులుగా టిప్పర్ల ద్వారా రాత్రి సమయంలో యథేచ్ఛగా తరలిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు. ఉదయం సమయంలో మట్టి రవాణా చేస్తే అధికారులు, ఇతరులు అడ్డుకుంటారని, రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు తమ దందా సాగిస్తున్నారు. ఆ చెరువులోనే జేసీబీని



చెరువులో ఒండ్రుమట్టిని తవ్వడంతో ఏర్పడిన గుంతలు

పెట్టి దాని సాయంతో టిప్పర్లు, ట్రాక్టర్లతో చెరువుకు నాలుగు, ఐదు కిలో మీటర్ల దూరంలో డంప్ చేస్తున్నారు. అలా ప్రతి రోజు దాదాపు 20 ట్రిప్పుల టిప్పర్లతో పాటు దాదాపు 50 ట్రిప్పుల ట్రాక్టర్ల ద్వారా మట్టి అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ మట్టిని ఒక టిప్పర్‌కు రూ.3500లు, ట్రాక్టర్‌కు రూ.700ల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అలా ఓ వ్యాపారి దాదాపు రూ.60వేలకు పైగా ఆదాయం పొందుతున్నట్లు ఆ గ్రామానికి చెందిన పలువురు విమర్శిస్తున్నారు.

> **మట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటాం**
>
> గత 10 రోజుల క్రితం చెరువులో నుంచి మట్టి తరలిస్తున్నారని తెలుసుకుని మా సిబ్బంది అడ్డుకున్నారు. రెండు, మూడు రోజులు నిలిపివేశారు. మళ్లీ రాత్రి సమయంలో తరలిస్తున్నట్లు తెలిసింది. మా సిబ్బందిని పంపించి మట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటాం.
>
> – ప్రేమ్ కుమార్, ఐబీ డీఈ, మునుగోడు

తేలుతున్న ఇసుక

దాదాపు 30 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న చెరువులో మూడు, నాల్గు ఫీట్ల లోతువరకు మాత్రమే ఒండ్రు మట్టి ఉంటుంది. అయితే ఒండ్రు మట్టి ఉన్నంత వరకు తవ్వి టిప్పర్లలో లోడు చేయడంతో అడుగు భాగంలోని ఇసుక తేలుతోంది. దీంతో రానున్న రోజులల్లో వర్షం కురిసి ఆ చెరువులోకి నీరు వచ్చి చేరితే ఒకటి రెండు రోజులు కూడా నిల్వ ఉండే అవకాశం లేదని రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మట్టి తరలింపును అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



18వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న దైద రవీందర్

నకిరేకల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ నేత దైద రవీందర్ అన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని 18 వార్డులో ఆదివారం ఆయన పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కౌన్సిలర్ దైద స్వప్న ఉన్నారు. కాగా.. నకిరేకల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మేరెడ్డి ప్రవీణ్‌రెడ్డిని దైద రవీందర్ సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా జీవన్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, తిరుపతి శ్రీను, చందుపట్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్ అందజేస్తున్న గాజుల సుకన్య

నకిరేకల్: నకిరేకల్ మున్సిపాలిటీలోని 4వ వార్డులోని సంతోష్‌నగర్ కు చెందిన పర్సబోయిన గణేష్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఇతనిది పేద కుటుంబం కావడంతో స్థానిక వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ గాజుల సుకన్య శ్రీనివాస్ శనివారం ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో పరమేష్, వెంకన్న, సుజాత, శ్రీనివాస్‌రెడ్డి, రాము, మారుతి పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్ నియామకంపై హర్షం

కేతేపల్లి: రాష్ట్ర వికలాంగుల విభాగం కార్పొరేషన్ చైర్మన్‌గా పెరిక కార్పొరేషన్ సాధన సమితి అధ్యక్షుడు ముత్తినేని వీరయ్యను ప్రభుత్వం నియమించటం పట్ల ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కోట మల్లికార్జునరావు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడారు.

వైద్యశిబిరాలు పేదలకు ఎంతో మేలు



మహిళకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

శాలిగౌరారం: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ ఎర్ర శంభులింగారెడ్డి అన్నారు. శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణానికి చెందిన ఐకాన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నేతృత్వంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 600 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ ప్రదీప్‌కుమార్, వైద్యులు శశాంక్‌కోడె, రవిశంకర్‌కన్నా, సాయిమౌనిక చెరుకూరి, శశీంద్ర, రాజేంద్రప్రసాద్, మహేశ్ వేమవరపు, పవన్‌కుమార్, అశోక్‌గౌడ్, జనరల్ మేనేజర్, ప్రవీణ్‌రెడ్డి, పీఆర్ఓ వెంకన్న, నాగరాజు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు బుడిగె శ్రీనివాసులు, దునుక వెంకన్న, చామల మహేందర్‌రెడ్డి, రామడుగు వెంట్రామశర్మ, బచ్చు ఆంజనేయులు, దామెర్ల శ్రీనివాసులు, గుండ్ల రామ్మూర్తి, రాపాక రాజు, మారోజు వెంకటాచారి, డెంకల సత్యనారాయణ, వడ్లకొండ భిక్షం, జగదీష్‌బాబు, కర్ణాకర్, వీరస్వామి, భీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

మునుగోడు: మండలంలోని కచలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కందుల బాలయ్య (58) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల నిమిత్తం గ్రామ కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. వారిలో మాజీ ఉప సర్పంచ్ కంచరకుంట్ల రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండకింది రాంరెడ్డి, బోయపల్లి నర్సింహ, దుబ్బాక నరేష్, పందుగ అశోక్, రాజు, జెట్టి గణేష్ తదితరులున్నారు.

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన ఆనగంటి కృష్ణారెడ్డి అనారోగ్యంతో గత పది రోజుల క్రితం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ జిల్లా నాయకురాలు అంతటి పారిజాత ఆదివారం పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సుర్కంటి సత్తిరెడ్డి, కార్యదర్శి చిర్రగోని శ్రీశైలం, చీమల వీరేశం, ఏనుగు సుధాకర్‌రెడ్డి, మారగోని యాదయ్య, అర్రూరీ నర్సింహ, కాటం సత్తయ్య పాల్గొన్నారు.

నకిరేకల్: మండలంలోని మంగళపల్లి గ్రామంలో నిరుపేద విద్యార్థి చిలుముల నరేష్ ప్రభుత్వ ఉద్యోగానికి సన్నద్ధమయ్యేందుకు కోచింగ్ నిమిత్తం బీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుండాల సోమయ్య ఉన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చిట్యాల: టెన్త్ పరీక్షలకు చిట్యాల పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్, గ్రీన్ గ్రోవ్ స్కూల్, న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. మొత్తం 480 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వీరిలో 267 మంది బాలురు, 203 మంది బాలికలు ఉన్నారని పేర్కొన్నారు.

మునుగోడు: మండలంలోని మొత్తం 440 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్ జోసఫ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి నర్సింహ ఆదివారం తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందని పేర్కొన్నారు.

కట్టంగూర్: మండల కేంద్రంలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ మేక నాగయ్య ఆదివారం తెలిపారు. మొత్తం 425 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డిపార్ట్‌మెంట్ అధికారులు, 24మంది ఇన్విజిలేటర్లు నియమించినట్లు తెలిపారు.

చండూరు: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ గురువా రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గట్టుప్పల్ ఒక సెంటర్, చండూరులో మూడు సెంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మొత్తం 657 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఇందులో బాలురు 358మంది, బాలికలు 299 మంది ఉన్నారని తెలిపారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్లు నలుగురు, డిపార్ట్‌మెంటల్ అధికారులు నలుగురు, ఇన్విజిలేటర్లు 36 మంది ఉన్నారని పేర్కొన్నారు. పరీక్ష సెంటర్ల దగ్గర 144 సెక్షన్ ఉంటుందని తెలిపారు.

ఆప్ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలి



మాట్లాడుతున్న కుతుబుద్దీన్

మిర్యాలగూడ అర్బన్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమ్‌ఆద్మీ(ఆప్) పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.కుతుబుద్దీన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు తమ నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో సభ్యత్వాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోర్‌కమిటీ నాయకులు డాక్టర్ అన్సారీ, జిల్లా కార్యదర్శి యార శ్రీను, పురుషోత్తం రెడ్డి, కీర్తి అశోక్, అద్దంకి రవీందర్, చేగొండి మహేందర్, వెంకటసుబ్బయ్య, అయ్యప్ప శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

మునుగోడు: ఉద్యోగం రావడం లేదనే మనస్తాపంతో మునుగోడుకు చెందిన చెరుపల్లి గిరీష్‌కుమార్ వారం రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబానికి అండగా ఉండేందుకు అతడి స్నేహితులు ఆదివారం రూ.55వేల ఆర్థిక సాయం అందజేశారు. వారిలో శివాజీ, మహేష్, నితీష్, చందర్, ప్రేమ్ చెందర్, భాస్కర్, అనిల్, కిషోర్ తదితరులున్నారు.

విచారణ జరిపించాలి

మిర్యాలగూడ అర్బన్ : వెనకబడిన తరుగతుల సంక్షేమ హాస్టల్ వర్కర్ల విషయంలో జరిగిన అవినీతిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర సైదానాయక్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యన మాట్లాడారు. జిల్లాలో బీసీ సంక్షేమ హాస్టళ్లలో వర్కర్ల సమస్య విపరీతంగా ఉందని, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నచోట వర్కర్ల అవసరం ఉందని చాలా సార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు జగన్, శివ, ముని తదితరులున్నారు.



మాట్లాడుతున్న కుర్ర సైదానాయక్

కార్పొరేషన్ పదవుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నియమించిన 37కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో సామాజిక న్యాయం జరిగి ప్రజా పాలన జరుగుతుందని అనుకుంటే ఈ ప్రభుత్వంలో కూడా మెజార్టీగా ఉన్న బీసీలకు అన్యాయమే జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 37 కార్పోరేషన్ చైర్మన్లలో జనాభా ప్రాతిపదికన సగానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 13 కార్పోరేషన్ మాత్రమే కేటాయించిందని, అగ్రకులాల వారికి 17 కార్పోరేషన్ చైర్మన్లను కేటాయించిదన్నారు. కేవలం ఒక్క కులానికి ఇస్తే ప్రజాపాలన అవుతుందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా ఒంటెద్దు పోకడలను మానుకోవాలని అన్నారు.

కుమ్మరులకు కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి : కుమ్మరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కుమ్మరి శాలివాహన సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు తోటపల్లి కిరణ్ అన్నారు. ఈమేరకు కుమ్మరుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మరుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, వృత్తిపరంగా, విద్యా, ఉద్యోగపరంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కుమ్మరులకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు ఎలిమినేటి సాయి, మండల అధ్యక్షుడు ఏరుకొండ రాము, ఘనపురం వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి సైదులు, మాడ్గుల యాదగిరి, నాయకులు బొడ్డుపల్లి శంకర్, తోటపల్లి వెంకటయ్య, బొడ్డుపల్లి మల్లేశ్, ఏరుకొండి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



మాట్లాడుతున్న వేముల వీరేశం

నార్కట్‌పల్లి: ఐఎన్‌టీయూసీ బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం నార్కట్‌పల్లిలో నిర్వహించిన ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ అనుబంధ) రీజియన్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు శ్రీనివాస్‌రెడ్డిల సహకారంతో అన్ని విభాగాలను బలోపేతం చేస్తానని తెలిపారు. నార్కట్‌పల్లి డిపోను తిరిగి పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహ్మద్ మాట్లాడుతూ గత పదేళ్లుగా ఆర్టీసీ డిపోలో యూనియన్లు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆర్టీసీ గుర్తింపుతో మరోసారి ఎన్‌టీయూసీ యూనియన్ బలోపేతం కానున్నదని తెలిపారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, జిల్లా నాయకులు కత్తుల యాదయ్య, రుద్రోజు శేఖర్, చంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉషయ్య, నాయకులు శేఖర్, నడింపల్లి మల్లేశం, పుల్లెంల అచ్చాలు, సిద్దగోని స్వామి గౌడ్, నేతగాని కృష్ణ, సత్తయ్య, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, సమద్, శశిధర్‌రెడ్డి, వేముల నర్సింహ, భూషన్, శేఖర్‌రెడ్డి, వెంకన్న, జాన్‌రెడ్డి తదితరులున్నారు.

నీళ్లు లేవు.. నీడ కరువు



బండపాలెంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో తప్పని ఇబ్బందులు
- అందుబాటులో లేని టెంట్లు, మెడికల్ కిట్లు

కేతేపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనులకు వెళ్తున్న కూలీలకు పని చేసే స్థలాల వద్ద కనీస వసతులు కరువయ్యాయి. పనుల వద్ద అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సరైన వసతులు కల్పించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కేతేపల్లి మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా అధికారులు 10,784 జాబ్‌కార్డులు జారీ చేశారు. ప్రస్తుతం రోజువారీగా 2వేల మంది వరకు కూలీలు పనులకు హాజరవుతున్నారు. గతేడాది నుంచి నూతన విధానం అమలు చేయటంతో కూలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలో పనిచేయాల్సి వస్తోంది. పనిప్రదేశం వద్ద కూలీలు పనిచేసే ఫొటోలను అప్‌లోడ్ చేసిన తర్వాతే కూలీలు ఇంటిబాట పట్టాలని, లేకుంటే హాజరు పడదని ఆదేశాలు జారీ చేయటంతో సాయంత్రం వరకు పని స్థలాల వద్దే ఉంటున్నారు.

వసతులు లేకపోవడంతో..

ఉపాధి హామీ పనులు చేపడుతున్న ప్రదేశాల్లో గతంలో గుడారాలతో పాటు, తాగునీరు అందుబాటులో ఉంచేవారు. ప్రస్తుతం వేసవికాలం ప్రారంభమైనా వాటి ఊసేలేదు. కూలీలు తమ ఇళ్ల వద్ద నుంచే నీటిని తెచ్చుకుంటున్నారు. గతంలో కూలీలు వేసవిలో తాగునీరు తెచ్చుకుంటే రోజు రూ.5 మూడు నెలల పాటు అలవెన్స్‌లు చెల్లించేవారు. కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చిన తర్వాత వాటి ఊసే లేకుండా పోయింది. కూలీలు పని ముగించుకుని కాసేపు నీడపట్టున సేద తీరేందుకు పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో గ్రీన్‌షెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం అవి అందుబాటులో లేకపోవటంతో కూలీలు చెట్లనీడన సేద తీరుతున్నారు. పనిచేసే ప్రాంతలో తాగునీరు, టెంట్ల ఏర్పాటు విధిగా అమలు చేయాల్సి ఉన్నా పాలకులు, ఉపాధి అధికారులు పట్టించుకోవడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు.

మెడికల్ కిట్లు లేవు..

కూలీలు పనిచేస్తున్న సమయంలో గాయాల పాలు కావడంతోపాటు అస్వస్థతకు గురయ్యే అవకాశముంది. అత్యవసర చికిత్స అందించేందుకు మెడికల్ కిట్లు, ఎండకు నీరసించి, వడదెబ్బ తగిలిన వారి కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు క్షేత్రస్థాయిలో ఎక్కడా కూడా అందుబాటులో ఉంచడం లేదు. అదేవిధంగా ఉపాధి కూలీలకు ఏళ్లుగా పార, గడ్డపార, తట్టలు అందడం లేదు. దీంతో కూలీలు వాటిని సొంతంగా ఏర్పాటు చేసుకుని పనులకు వెళ్తున్నారు.

> **సక్రమంగా అందని వేతనాలు**
>
> ఉపాధి పనులు చేసిన కూలీలకు సక్రమంగా బిల్లులు అందడం లేదు. 15 రోజులకోసారి వేతనాలు అందించాల్సి ఉండగా నెల రోజులు దాటినా డబ్బులు జమ కావడం లేదు. దీంతో కొన్ని గ్రామాల్లో పనులు చేసేందుకు కూలీలు వెనుకడుగు వేస్తున్నారు. జనవరి 15 వరకు మాత్రమే కూలీల వేతనాలు వారి ఖాతాలో జమ చేశారు. తిరిగి మళ్లీ వేతనాలు జమలేదు.

> **ఎలాంటి వసతులు లేవు**
>
> 
>
> మేము ఉపాధి పనులు చేసే చోట ఎలాంటి వసతులు ఉండడం లేదు. ఎండలోనే పనులు చేస్తున్నాం. నీడ కోసం చెట్లను ఆశ్రయిస్తున్నాం. తాగునీటి సౌకర్యంతో పాటు, మెడికల్ కిట్లు, అత్యవసర మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి. చేసిన కూలి పనికి వెంటనే డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.
>
> – పల్లె గుర్వయ్య, కేతేపల్లి

> **వసతులు కల్పిస్తాం**
>
> 
>
> గతంలో కూలీలు పనిచేసే చోట టెంట్లు, పారలు ప్రభుత్వం నుంచి వచ్చేవి. గత ఆరు, ఏడేళ్ల నుంచి రావడం లేదు. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండే విధంగా చూస్తాం. మిగతా వసతుల కల్పన విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
>
> – సురేందర్, ఏపీఓ, కేతేపల్లి

ఎన్నికల కోడ్.. అధికారులు అప్రమత్తం

గట్టుప్పల్(చండూరు), శాలిగౌరారం, మర్రిగూడ: ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పార్టీల జెండాలకు ముసుగులు వేస్తూ, పార్టీ కార్యాలయాల బోర్డులు, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. మర్రిగూడ: ఎన్నికల కోడ్ రావడంతో గోడలపై రాజకీయ నాయకుల ప్రచారానికి సంబంధించిన ఉన్న వాల్ రైటింగ్స్ శుభ్రం చేస్తున్నట్లు ఎంపీడీఓ చినమునయ్య ఆదివారం తెలిపారు. ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



మర్రిగూడ చౌరస్తా వద్ద విగ్రహానికి ముసుగు తొడిగిన సిబ్బంది



శాలిగౌరారం: రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది



గట్టుప్పల్ మండల కేంద్రంలో పార్టీ గుర్తును చెరిపేస్తున్న సిబ్బంది